జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శనివారం | 23-5-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 680 పేజీలు: 4 వెల : రూ.7


## బెల్ట్ షాపుల జోరు..
# మామిడిపల్లి బేజార్..!



* అమ్మవారి సంబరాల్లో అడుగడుగునా మద్యం * గ్రామంలో ఏకంగా నాలుగు బెల్టు షాపులు
* లక్షల్లో సిండికేట్ వ్యాపారుల డీల్ * మద్యం వ్యాపారులకు కొందరు అధికారుల సహకారం

**సోంపేట మే 22 (వార్త):** ఒకవైపు ఎక్సైజ్... మరోవైపు పోలీస్ యంత్రాంగాన్ని తమ గుప్పెట్లో పెట్టుకుని కొంతమంది మద్యం వ్యాపారులు మామిడిపల్లి అమ్మవారి సంబరాల్లో యధేచ్ఛగా మద్యం విక్రయాలు జరుపుతున్నారు. పగలు రాత్రి తేడా లేకుండా సంబరాలను అడ్డం పెట్టుకొని గ్రామంలో ఏకంగా నాలుగు బెల్ట్ షాపులు దర్జాగా నిర్వహిస్తున్నారంటే ఇక్కడ పరిస్థితులు ఎంత ఘోరంగా ఉన్నాయో అర్ధమవుతుంది. కొద్దిరోజుల క్రితం మామిడిపల్లిలో మొదలైన సంబర మహోత్సవాలుకు ముందే కొర్లాంకు చెందిన ఇద్దరు మద్యం సిండికేట్ వ్యాపారులు గ్రామంలో కొంతమంది పెద్దలతో చేతులు కలిపి బెల్టు వ్యాపారం ద్వారా వచ్చే అక్రమాదాయాన్ని వాటాల నిర్ణయించుకుంటూ అడ్డొచ్చే అధికారులను సైతం ఆమ్యామ్యాలతో వశం చేసుకుంటూ దర్జాగా మద్యం వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. ఈమధ్య అక్రమ బెల్ట్ షాపులు మామిడిపల్లి గ్రామంలో ఈనెల 18 నుంచి జూన్ 18 వరకు కొనసాగించేందుకు ఒక నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో కొద్ది మందికి సంబంధించి లక్షల రూపాయల్లో డీల్ కుదుర్చుకున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఈ మేరకు మామిడిపల్లి గ్రామ జంక్షన్లో అలాగే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదురుగా, గ్రామ నడిబొడ్డులో ఒకచోట, గ్రామ శివారున ఒక కూటమి నాయకుని ఇంటి వద్ద బెల్ట్ వ్యాపారం దర్జాగా మూడు గ్లాసులు ఆరు పెగ్గులతో కొనసాగుతోంది. అమ్మవారి పండగల్లో ఎంతో భక్తి భావంతో అమ్మవారిని దర్శించుకుంటూ సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించి బంధువుల ఇళ్లకు వెళ్లి సరదాగా గడపాల్సిన సంబరాల్లో ప్రతిరోజు వేలాదిమంది గ్రామంలో యదేచ్ఛగా లభిస్తున్న మద్యం పట్ల ఆకర్షితులవుతున్నారు. దీంతో గ్రామంలో ఎటు చూసినా మద్యం బాటిళ్లు, ప్లాస్టిక్ గ్లాసులు, వాటర్ ప్యాకెట్ కవర్లతో గ్రామ వాతావరణం అసహ్యకరంగా మారుతుందని గ్రామంలో విద్యావంతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. వీధుల్లో మద్యం కంపుతో సంబరాల పేరిట ఇలా మందు విక్రయాలు జరపడం ఏ మాత్రం సరి కాదంటూ మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### నకిలీ మద్యం అంటూ ఆరోపణలు..

మామిడిపల్లి గ్రామంలో బెల్ట్ షాపుల ద్వారా విక్రయిస్తున్న మద్యం నకిలీ మద్యం అంటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. లైసెన్సుడ్ దుకాణాల్లో లభించే మద్యం కన్నా ఇక్కడ విక్రయిస్తున్న మద్యం అత్యంత ఘాటుగా ఉందని కొద్ది మాత్రం సేవించినా సరే శరీరమంతా ముచ్చేమటలు పట్టి తలవిపరీతంగా తిరుగుతుంది అంటూ పలువురు మందుబాబులు పేర్కొంటున్నారు. సంబరాల పేరుతో అధిక ధరలు వసూలు చేస్తూ అత్యంత చీప్ క్వాలిటీ విక్రయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం..

మామిడి పల్లెలో పట్టపగలు,రాత్రి తేడా లేకుండా నిబంధనలకు వ్యతిరేకంగా ఇష్టారాజ్యంగా మద్యం విక్రయాలు జరుగుతున్నా ఇటు ఎక్సైజ్ శాఖ గాని అటు పోలీస్ శాఖ గాని కనీసం కన్నెత్తి చూడకపోవడం పట్ల సామాన్య ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబరాలకు ముందు గత నెలలో గ్రామంలో అధికారికంగా బెల్ట్ షాప్ నిర్వహణకు 50 వేల రూపాయలకు వేలంపాట ద్వారా నిర్ణయం జరగడం గమనార్హం. అదే అదనుగా సంబరాల్లో మరో మూడు బెల్ట్ షాపులు పెంచి గ్రామం పరువు ప్రతిష్టలు బజారుకీడ్చారని పలువురు విద్యావంతులు వాపోతున్నారు. ఉన్నత పాఠశాల ఎదురుగా బెల్ట్ షాప్ ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసమని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే సోంపేట మండలంలో ఏ గ్రామం చూసిన మంచినీరు దొరుకుతుందో లేదో గాని విరివిగా బెల్ట్ షాపులతో మద్యం మాత్రం మూడు పూటలా మస్తుగా లభిస్తున్న విషయం అక్షర సత్యం. ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్న బెల్ట్ షాప్ నిర్వాహకులపై సిండికేట్ వ్యాపారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని బాధ్యులైన అధికారులు మౌనం వీడాలని అభ్యుదయవాదులు వేడుకుంటున్నారు.



## నేటి నుంచి ఆపరేషన్ క్లీన్ స్వీప్

* మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కూర్మారావు

**శ్రీకాకుళం, మే 22 (వార్త):** పారిశుధ్యం మెరుగుదల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా శనివారం నుంచి జూన్ 20వ తేదీ వరకు 'ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కూర్మారావు తెలిపారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా సెవెన్ రోడ్ జంక్షన్ వద్ద ఉదయం 6 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్, ప్రజా ప్రతినిధులు, ఎన్జీవోస్, మునిసిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొంటారని పేర్కొన్నారు. శ్రీకాకుళం ప్రజలందరూ కూడా పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. మొదటివారం రోజులు నగరంలోని రోడ్స్, బ్లాక్ స్పాట్స్ క్లీనింగ్ చేయడం, ఎల్లో అండ్ రెడ్ స్పాట్స్ క్లీనింగ్ చేయడం జరుగుతుందని వివరించారు. రెండవ వారంలో మురుగునీటి కాలువలు, వరద నీటి కాలువలలో పూడిక తొలగించడం, మూడో వారంలో చెత్త వర్గీకరణపై ప్రజలకు అవగాహన, వాణిజ్య ప్రాంతాలలో ప్రత్యేక పారిశుధ్యంపై దృష్టి పెట్టడం, నాలుగో వారంలో సామూహిక మరుగుదొడ్ల నిర్వహణపై అవగాహన తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

## కన్న పిల్లలు..
## అనాథను చేశారు
### ఓ వృద్ధురాలి కన్నీటి ఆవేదన



**పలాస, మే 22 (వార్త):** వజ్రపుకొత్తూరు మండలం కొమరల్తాడ గ్రామంలో ఓ వృద్ధురాలి ఆవేదన అందరినీ కలచివేస్తోంది. కన్న పిల్లలే.. వృద్ధాప్యంలో తనను పట్టించుకోవడం లేదంటూ ఓ తల్లి కన్నీటి పర్యంతమైంది. ఆస్తి మొత్తం కుమారుల చేతుల్లోకి వెళ్లిన తర్వాత తాను పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యానని ఆరోపిస్తూ దూగాన లచ్చమ్మ అనే వృద్ధురాలు అధికారులను ఆశ్రయించింది. లచ్చమ్మ తెలిపిన వివరాల మేరకు తన భర్త జనార్ధనరావు అనారోగ్యంతో కొన్నేళ్ల క్రితం మృతి చెందాడు. చెప్పారు. అప్పటి వరకు కుటుంబంలో ఉన్న పరిస్థితులు భర్త మరణానంతరం ఒక్కసారిగా మారి పోయాయి. జీవితాంతం కష్టపడి సంపాదించిన సుమారు 1.70 ఎకరాల జీడి తోట ప్రస్తుతం కుమారుల ఆధీనంలోకి వెళ్లింది. ఆస్తి పంపకాలు పూర్తయ్యాక తల్లి వారికి భారంగా మారారు. 'వృద్ధాప్యంలో అండగా ఉంటారని ఆశించిన తల్లికి.. ఆ కొడుకులు ఇప్పుడు మాట్లాడటానికీ ముందుకు రావడం లేదు. ప్రస్తుతం ఆమె కిడ్నీ సంబంధిత సమస్యలు, బీపీ, షుగర్, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతోంది. ఈ పరిస్థితిలో ఆమెను చూసుకునే వారు ఎవరూ లేకపోవడంతో కన్నీరుమున్నీరవుతోంది. 'బతికుండగానే అనాథలా మారిపోయాను" అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు స్థానికులను కదిలించాయి. ఈ వ్యవహారంపై ఇప్పటికే వజ్రపు కొత్తూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు లచ్చమ్మ తెలిపారు. తనకు ప్రాణహాని ఉందని, పూర్తి స్థాయిలో విచారణ జరిపి రక్షణ కల్పించాలని అధికారులను వేడుకుంటున్నారు.

# ఫిట్ శ్రీకాకుళంకు సిద్ధం కావాలి



* కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు
* కార్గిల్ పార్క్ వద్ద ఎంపీ కప్ క్రికెట్ టోర్నీ
* ఉత్సాహంగా ఆడిన కేంద్ర మంత్రి, ఎమ్మెల్యే, ఇన్‌చార్జ్ కలెక్టర్, ఎస్పీ

**శ్రీకాకుళం, మే 22 (వార్త):** ప్రధాని మోదీ పిలుపునిచ్చిన ఫిట్ ఇండియా స్పూర్తితో.. ఫిట్ శ్రీకాకుళం సాధించడానికి అందరూ సమాయత్తం అవ్వాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పిలుపునిచ్చారు. ఎర్రన్న క్రీడా ఉత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం శ్రీకాకుళం నగరంలోని కార్గిల్ పార్క్ వద్ద ఎంపీ కప్ 2026 బాక్స్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. టోర్నీ లోగోను ఆవిష్కరించి.. క్రీడాకారులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. అంతకుముందు.. టోర్నీ ప్రారంభోత్సవం సందర్భంగా స్నేహపూర్వక మ్యాచ్ లో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, ఇంచార్జ్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్, ఎస్పీ మహేశ్వర్ రెడ్డిలు జట్లుగా విడిపోయి క్రికెట్ ఆడారు. సుమారు గంట సేపు పాటు క్రికెట్ ఆడి.. అక్కడి వారిలో కేంద్ర మంత్రి ఉత్సాహం నింపారు. ఎంపీ కప్ బాక్స్ క్రికెట్ టోర్నీ ఈ నెల 30వ తారీఖు వరకు జరుగుతుందని, యువత సెల్ ఫోన్ లను వదలి వ్యాయామం వైపు దృష్టి సారించాలనే ఉద్దేశ్యంతోనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని రామ్మోహన్ నాయుడు తెలిపారు. ప్రధాని మోదీ పిలుపునిచ్చిన ఫిట్ ఇండియా నినాదానికి స్పూర్తిగా.. ఫిట్ శ్రీకాకుళం కు మనమంతా సిద్ధమవ్వాలని రామ్మోహన్ నాయుడు కోరారు. నేటి యువత తమ దైనందిన జీవితంలో ఏదో ఒక క్రీడను అలవాటు చేసుకోవాలని సూచించారు. అభివృద్ధి సాధించాలంటే.. అందరూ ఆరోగ్యంగా ఉండాలని.. అందుకు క్రీడలు, వ్యాయామం తోడ్పాటునిస్తాయని అన్నారు. ఎర్రన్న క్రీడా ఉత్సవంలో భాగంగా జరుగుతున్న ఈ ఎంపీ కప్ క్రికెట్ టోర్నీ విజయవంతం అవ్వడానికి సహకరించిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. రెవెన్యూ, పోలీసు అధికారులు, స్థానికులు పెద్ద ఎత్తున కార్యక్రమంలో భాగస్వామ్యం అయ్యారు.





## బాల బాలికలకు కిశోరి వికాసంతో మేలు

**- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్.వి.రామలక్ష్మి**

**మందస, మే 22(వార్త):** వేసవి సెలవుల్లో బాలబాలికలకు కిశోరి వికాసం కార్యక్రమంతో ఎంతగానో మేలు జరుగుతుందని ఐసీడీఎస్ సూపర్ వైజర్ సీహెచ్.వి.రామలక్ష్మి అన్నారు. మందస మండలంలోని కొండలోగాంలో శుక్రవారం కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామలక్ష్మి మాట్లాడుతూ జీవన నైపుణ్యాలపై బాల బాలికలకు అవగాహన కల్పించారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ పై అవగహన కల్పించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

గర్భవతులకు తల్లి నుంచి బిడ్డకు హెచ్ఐవీ సంక్రమించకుండా ఉండడానికి కౌన్సిలింగ్, వైద్యుల సలహాలు ఎలా తీసుకోవాలో చెప్పారు. అంగన్ వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వేసవి సెలవులలో శిక్షణా కార్యక్రమాల్లో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఆమె చెప్పారు. కార్యక్రమంలో సంబంధిత అంగన్ వాడీ కేంద్రాల కార్యకర్తలు, ఆయా గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.



## తొలకరికి ముందే నవధాన్యాల సాగు చేపట్టాలి

**-నేల సారవంతం పెంపునకు ప్రకృతి వ్యవసాయం దోహదం**

**- కంబకాయలో 12 జాతుల 30 రకాల విత్తనాలు**



**నరసన్నపేట, మే 22 (వార్త):** ఖరీఫ్ సీజన్‌కు ముందుగా రైతులు నవధాన్యాల సాగుపై దృష్టి సారించాలని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ రమణ సూచించారు. తొలకరి వర్షాలు కురిసేలోపే నవధాన్యాలను సాగు చేయడం ద్వారా నేల సారవంతత పెరగడంతో పాటు ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన అనుకూల వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. శుక్రవారం నరసన్నపేట మండలం కంబకాయ గ్రామంలో ఈదు అప్పారావు పొలంలో నిర్వహించిన నవధాన్యాల విత్తన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 12 జాతులకు చెందిన 30 రకాల విత్తనాలను భూమిలో వేశారు. మొత్తం 15 కిలోల విత్తనాలను వినియోగించినట్లు తెలిపారు. నవధాన్యాల సాగు ద్వారా భూమిలో సేంద్రియ కర్బనం శాతం పెరుగుతుందని, నేలలో సూక్ష్మజీవుల వృద్ధికి అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని రమణ వివరించారు. దీంతో భూమి ఆరోగ్యం మెరుగుపడి తదుపరి పంటలకు అవసరమైన పోషకాలు సహజసిద్ధంగా లభిస్తాయని చెప్పారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడంలో నవధాన్యాల సాగు కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు. రైతులు తమ పొలాల్లో ఈ విధానాన్ని అమలు చేసి భూమి సారాన్ని కాపాడుకోవాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటల దిగుబడితో పాటు నేల నాణ్యత కూడా మెరుగుపడుతుందని, దీర్ఘకాలిక వ్యవసాయాభివృద్ధికి ఇది ఉపయోగపడుతుందని రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక రైతులు, ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్

**- ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి**




**పోలాకి, మే 22 (వార్త):** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రజా దర్బార్ కార్యక్రమాలు వేదికగా నిలుస్తున్నాయని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శుక్రవారం పోలాకి మండలం కత్తిరివాని పేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్య నిర్వహక కార్యదర్శి బగ్గు అర్చన కూడా పాల్గొన్నారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు రోడ్ల మరమ్మతులు, తాగునీటి సౌకర్యాలు, ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరు, పెన్షన్ల సమస్యలు, విద్యుత్ సరఫరా ఇబ్బందులు తదితర అంశాలపై ఎమ్మెల్యేకు వినతిపత్రాలు అందజేశారు. ప్రజల సమస్యలను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఓర్పుగా విని సంబంధిత అర్జీలను పరిశీలించారు. అత్యవసర సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో వెంటనే ఫోన్‌లో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్యలను ప్రాధాన్యత ఆధారంగా పరిష్కరించాలని అధికారులను సూచించారు. ఇతర సమస్యలను కూడా దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండటం ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని, నియోజకవర్గ అభివృద్ధి మరియు ప్రజా సంక్షేమమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతి అర్జీపై సమగ్రంగా స్పందించి సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# ధర్మానను సన్మానించిన గిరిబాబు

**-పూరీ నుంచి వస్తుండగా పలాసలో పూలమాల, దుశ్శాలువాతో ఘన స్వాగతం**

**పలాస, మే 22 (వార్త):** పుణ్యక్షేత్రమైన పూరీలో జన్మదిన వేడుకలు జరుపుకుని శ్రీకాకుళం తిరిగి వెళుతున్న మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నాయకులు ధర్మాన ప్రసాదరావుని పలాస–కాశీబుగ్గ మున్సిపల్ మాజీ చైర్మన్ బల్ల గిరిబాబు ఆధ్వర్యంలో స్థానిక నేతలు ఘనంగా సన్మానించారు. శనివారం సాయంత్రం పలాస మీదుగా వెళుతున్న ధర్మాన ప్రసాదరావుని బల్ల గిరిబాబు, ఎంపీటీసీ మద్దు రాంప్రసాద్, మాజీ కౌన్సిలర్ రోణంకి రమణ, పెద్దలు వల్లభ వైకుంఠరావు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ జుత్తు నేలకంఠం, మందస మండల మాజీ ఎంపీపీ కోర్ణాన ఆదినారాయణ, మార్పు మన్మధరావు, లోహరిబంద్ సర్పంచ్ రాపాక శేషగిరి, బొంగి రమణ తదితర నాయకులు కలిసి దుశ్శాలువా, భారీ పూలమాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బల్ల గిరిబాబు మాట్లాడుతూ, “ధర్మాన ప్రసాదరావు గారు ఉత్తరాంధ్ర ముద్దుబిడ్డ. రెవెన్యూ, రోడ్లు భవనాల శాఖ మంత్రిగా జిల్లా అభివృద్ధికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయం. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ ఏర్పాటు, నియోజకవర్గంలో సాగునీటి ప్రాజెక్టులు, రోడ్ల అభివృద్ధి ఆయన చొరవతోనే సాధ్యమయ్యాయి. అటువంటి నాయకుడిని జన్మదినం రోజున కలిసి సత్కరించడం మా అదృష్టం. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో కొనసాగాలి” అని అన్నారు. అభిమానుల ఆప్యాయతకు మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు కృతజ్ఞతలు తెలిపారు. “పూరీ జగన్నాథుని దర్శనంతో నా జన్మదినం మొదలైంది. పలాసలో మీ అందరి ప్రేమతో సంపూర్ణమైంది. మీ ఆశీస్సులే నాకు శ్రీరామరక్ష” అని ఆయన పేర్కొన్నారు. కాసేపు నాయకులతో ముచ్చటించి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న అనంతరం ఆయన శ్రీకాకుళంకు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ధర్మాన అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలల ఆర్ఓ ప్లాంట్లకు మరమ్మతులు

**- వచ్చే విద్యా సంవత్సరానికి అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు**

**- జలుమూరు మండలంలో 29 ఆర్ఓ ప్లాంట్లు ఉన్నట్లు ఎంఈవో వెల్లడి**



**జలుమూరు, మే 22 (వార్త):** జలుమూరు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఆర్ఓ ప్లాంట్ల మరమ్మతు పనులు చేపడుతున్నట్లు మండల విద్యాశాఖ అధికారి (ఎంఈవో) బమ్మిడి మాధవరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని ఆర్ఓ ప్లాంట్ల పరిస్థితిపై వివరాలను వెల్లడించారు. మండల పరిధిలో మొత్తం 29 ఆర్ఓ ప్లాంట్లు ఉన్నాయని, వీటిలో చాలా ప్లాంట్లు గత రెండేళ్లుగా మరమ్మతులకు గురై వినియోగానికి దూరంగా ఉన్నాయని తెలిపారు. సాంకేతిక లోపాలు, నిర్వహణ సమస్యల కారణంగా కొన్ని ప్లాంట్లు పనిచేయకుండా మూలకు చేరాయని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన తాగునీరు అందించడం విద్యాశాఖ ప్రాధాన్య లక్ష్యమని, అందుకే పనిచేయని ప్లాంట్లను గుర్తించి దశలవారీగా మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే వీలైనన్ని ఆర్ఓ ప్లాంట్లను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. పాఠశాలల్లో తాగునీటి సౌకర్యాల మెరుగుదలకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన అన్ని వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని ఎంఈవో పేర్కొన్నారు. ఆర్ఓ ప్లాంట్ల మరమ్మతులు పూర్తయిన తర్వాత విద్యార్థులు పరిశుభ్రమైన, శుద్ధి చేసిన తాగునీటిని సులభంగా పొందగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పనులను పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు.

## ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి

**- ఏపీ ఎన్జీజివోస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాయి వేణుగోపాల్**

**పలాస, మే 22 (వార్త):** ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ ఎన్జీజివోస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాయి వేణుగోపాల్ డిమాండ్ చేశారు. కాశీబుగ్గ రాష్ట్ర పన్నుల శాఖ కార్యాలయం నందు పలాస డివిజన్ ఉద్యోగస్తులు కమర్షియల్ టాక్స్, వైద్య ఆరోగ్యశాఖ ,ఏపీఎస్ఆర్టీసీ కాంటాక్ట్ ఔట్సోర్సింగ్ అసోసియేషన్ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు రాయి వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే పిఆర్సి కమిషన్ నియమించి ఇఆర్ ప్రకటించాలని, ఉద్యోగులకు రావలసిన డి ఏ ఏరియాస్, సరెండర్ లీవ్స్ ఇతర బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. ఉద్యోగులు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య సంక్షేమ వారధిగా ఉంటూ ప్రతి కార్యక్రమాన్ని తమవంతుగా బాధ్యతగా తీసుకెళుతున్న ఉద్యోగుల ఆర్థిక, న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జేఏసీ అధ్యక్షులు చౌదరి పురుషోత్తమ నాయుడు మాట్లాడుతూ రిటైర్డ్ ఎంప్లాయిస్ ఎడిషనల్ క్వాంటం పెన్షన్ ని పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. ఉద్యోగుల ఇహెచ్ ఎస్ సక్రమంగా అమలయ్యే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రెటరీ చల్లా శ్రీనివాసరావు, అసోసియేట్ ప్రెసిడెంట్ కంట జయరావు, జాయింట్ సెక్రెటరీ కొర్ల మన్మధరావు, పలాస ఏపీ ఎన్జీవో అధ్యక్షులు బోనెల గోపాల్, సెక్రెటరీ బి ఉపేందర్ రావు, అసిస్టెంట్ కమిషనర్ కందుల నాగరాజు, డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ జి శారదా దేవి, ఖాళీ ప్రసాద్ పండ, బాలు, కె వి నరసింగ మూర్తి, బి భార్గవ్, భాగ్య రావు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఏపీఎస్ఆర్టీసీ సంఘ నాయకులు శ్రీనివాసరావు, రిషికేశ్వరరావు, చక్రధర్, శ్యామ్ పంచాయతి రాజ్ సద్గుణబాబు, ఇరిగేషన్ అధికారి పి శ్రీనివాసరావు, అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ ప్రగడగిరి, కోపరేటివ్ అధికారి దుర్గాప్రసాద్ పట్నాయక్, గ్రీన్ ఆర్మీ సభ్యులు కిషోర్ పాత్రో, వివిధ ప్రజా సంఘాలు తదితరులు పాల్గొన్నారు.




## కంటి వైద్య శిబిరంలో 80 మందికి పరీక్షలు

**-34 మంది రోగులను శస్త్రచికిత్సల కోసం ఎంపిక**

**-జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో వైద్య సేవలు**



**సారవకోట, మే 22 (వార్త):** సారవకోట, బొంతు గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 80 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరానికి స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. సారవకోట వైస్ ఎంపీపీ గుణుపురం రామారావు, మాజీ సర్పంచ్ శంకర్‌బాబు సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో నిపుణులైన వైద్యులు రోగులకు సమగ్ర కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి సంబంధిత సమస్యలను గుర్తించి అవసరమైన వైద్య సూచనలు అందించారు. పరీక్షల్లో కంటి శస్త్రచికిత్స అవసరమున్న 34 మందిని గుర్తించి తదుపరి చికిత్సల కోసం ప్రత్యేకంగా ఎంపిక చేసి ఆసుపత్రికి తరలించారు. శస్త్రచికిత్సలు పూర్తిగా ఉచితంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో కంటి ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం, కంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందించడం లక్ష్యంగా ఇటువంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వైద్యులు పేర్కొన్నారు. కంటి చూపు మందగించడం, మసకబారడం వంటి సమస్యలు ఉన్నవారు నిర్లక్ష్యం చేయకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, ప్రజలు ఆరోగ్య పరీక్షలను సద్వినియోగం చేసుకుని కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. శిబిరంలో వైద్య సిబ్బంది, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వడదెబ్బ లక్షణాలపై అప్రమత్తంగా ఉండాలి

**-ఉపాధి హామీ కార్మికులకు ఆరోగ్యంపై అవగాహన**

**- నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణాలు తరచూ తీసుకోవాలని సూచన**

**పోలాకి, మే 22 (వార్త):** వేసవి తీవ్రత కొనసాగుతున్న నేపథ్యంలో వడదెబ్బ లక్షణాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పోలాకి ఆరోగ్య విస్తరణ అధికారి నల్లి రవికుమార్ సూచించారు. శుక్రవారం పోలాకి మండలం సంతలక్ష్మీపురంలో ఉపాధి హామీ కార్మికులకు వడదెబ్బ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధిక దాహం, తలతిరగడం, తలనొప్పి, తీవ్రమైన అలసట, వాంతులు వంటి లక్షణాలు వడదెబ్బకు సంకేతాలని తెలిపారు. ఇలాంటి లక్షణాలు కనిపించిన వెంటనే ఎండ నుంచి దూరంగా వెళ్లి విశ్రాంతి తీసుకోవడంతో పాటు ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. మండుటెండల్లో పనిచేసే కార్మికులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, తరచూ నీరు తాగుతూ శరీరంలో ద్రవాల కొరత ఏర్పడకుండా చూసుకోవాలని చెప్పారు. మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణాలు, ఇతర శీతల పానీయాలను తీసుకోవడం ద్వారా వడదెబ్బ నుంచి రక్షణ పొందవచ్చని వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే వైద్య సహాయం పొందడం ఎంతో ముఖ్యమని, ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. వేసవి కాలంలో ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం సూచించిన జాగ్రత్తలను పాటించాలని కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం రమాతో పాటు ఆరోగ్య సిబ్బంది పాల్గొని కార్మికులకు వడదెబ్బ నివారణ చర్యలపై సూచనలు అందించారు.



## ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

**- ఉపాధి కార్మికులకు శక్తి టీమ్ అవగాహన**

**- ‘అభయం’ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచన**

**పోలాకి, మే 22 (వార్త):** ద్విచక్ర వాహనదారులు తమ భద్రత కోసం హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని టెక్కలి డివిజన్-4 శక్తి టీమ్ సభ్యులు సూచించారు. శుక్రవారం పోలాకి మండలం కొండెక్కివలస గ్రామంలోని బొల్లిచెరువు వద్ద ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్న కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల సమయంలో హెల్మెట్ ప్రాణరక్షకంగా పనిచేస్తుందని తెలిపారు. ద్విచక్ర వాహనాలను నడిపే వారు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ హెల్మెట్ ధరించడం అలవాటు చేసుకోవాలని సూచించారు. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి చర్యలను పూర్తిగా నివారించాలని కోరారు. మహిళలు, యువతులు మరియు అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారి రక్షణ కోసం జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర్ రెడ్డి చేపట్టిన ‘అభయం’ కార్యక్రమం గురించి కూడా వివరించారు. అవసరమైన సందర్భాల్లో అభయం సేవలను వినియోగించుకుని తక్షణ సహాయం పొందవచ్చని తెలిపారు. అలాగే శక్తి యాప్ వినియోగ విధానం, అత్యవసర సమయాల్లో ఫిర్యాదులు నమోదు చేసే పద్ధతులపై కార్మికులకు అవగాహన కల్పించారు. వ్యక్తిగత భద్రతతో పాటు కుటుంబ సభ్యుల రక్షణ విషయంలో కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుళ్లు ఎం. గిరిధర్, భీమారావు తదితరులు పాల్గొని కార్మికులకు పలు భద్రతా సూచనలు చేశారు. ఉపాధి కార్మికులు కార్యక్రమంపై ఆసక్తి కనబరిచి సందేహాలను నివృత్తి చేసుకున్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## శివాజీనగర్‌లో పోలీసుల అవగాహన

**పలాస, మే 22 (వార్త):** కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ ఎస్సై ఆర్. నరసింహామూర్తి ఆధ్వర్యంలో శుక్రవారం పలాస మండలంలోని శివాజీనగర్ వార్డులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బందితో కలిసి గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి నారీ శక్తి, కొత్త చట్టాలు, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలోని దేవాలయాలు, మసీదులు, చర్చిల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామంలో పండుగలు, ఉత్సవాలు నిర్వహించే సమయంలో ముందస్తుగా పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, బెట్టింగ్, పేకాట, గంజాయి, నాటు సారా అక్రమ రవాణా, అమ్మకాలపై ప్రజలకు వివరించారు. బాల్య వివాహాల నివారణ, మహిళలపై జరిగే నేరాలు, అత్యవసర సేవల కోసం 112 కాల్ వినియోగం తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాశీబుగ్గ పోలీసులు, శివాజీ నగర్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# బడి ఈడు పిల్లలు ఆరోగ్యంగా ఎదగాలి

**-పౌష్టికాహారం, ఆరోగ్య అలవాట్లపై అవగాహన కలిగి ఉండాలి**

**-కిషోర్ వికాస్ శిక్షణలో సీడీపీవో**

**కార్యాలయ పర్యవేక్షణ అధికారుల సూచన**



**జలుమూరు, మే 22 (వార్త):** బడి ఈడు పిల్లలందరూ ఆరోగ్యంగా ఎదుగుతూ మంచి జీవనశైలిని అలవర్చుకోవాలని సీడీపీవో కార్యాలయ పర్యవేక్షణ అధికారులు సీతారత్నం, ఎల్. మనోహరి సూచించారు. శుక్రవారం జలుమూరు మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కిషోర్ వికాస్ వేసవి సెలవుల శిక్షణ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పిల్లల శారీరక, మానసిక వికాసానికి పౌష్టికాహారం ఎంతో అవసరమని తెలిపారు. ప్రతిరోజూ సమతుల ఆహారం తీసుకోవడం, ఆకుకూరలు, పండ్లు, పాలు, గుడ్లు వంటి పోషకాహార పదార్థాలను ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు.

పరిశుభ్రమైన ఆహారం తీసుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని వివరించారు. వేసవి కాలంలో తగినంత నీరు తాగడం, ఎండ తీవ్రత నుంచి రక్షణ పొందేందుకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. అలాగే విద్యార్థులు సెలవు రోజులను సద్వినియోగం చేసుకుంటూ చదువుతో పాటు క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాల్లో పాల్గొనాలని ప్రోత్సహించారు. పిల్లలలో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత పెంపొందించడమే కిషోర్ వికాస్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు ఆరోగ్య సంరక్షణ, పౌష్టికాహారం, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు స్థానికులు పాల్గొన్నారు.

## ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ



**జలుమూరు, మే 22 (వార్త):** వేసవి తీవ్రత కారణంగా ప్రయాణికులు దాహార్తికి గురికాకుండా ఉపశమనం కల్పించేందుకు ఎంఎస్‌ఎన్ స్కూల్ ఆధ్వర్యంలో శుక్రవారం చల్లవానిపేట జంక్షన్‌లో మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సేవా కార్యక్రమానికి స్థానిక ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. కార్యక్రమాన్ని ఎంఎస్‌ఎన్ స్కూల్ ఫౌండర్ మరియు చైర్మన్ మామిడి సత్యనారాయణ, లింగాలవలస మాజీ ఉపసర్పంచ్ కిల్లి వెంకటరావు ప్రారంభించారు. ప్రయాణికులు, వాహనదారులకు మజ్జిగ పంపిణీ చేసి వేసవి వేడిమి నుంచి ఉపశమనం కల్పించారు. ఈ సందర్భంగా ఎంఎస్‌ఎన్ స్కూల్ డైరెక్టర్ ఉప్పాడ ఉమాశంకర్, ప్రిన్సిపాల్ ఉప్పాడ సుగుణ, సిబ్బంది చిన్నారావు, అలబాన నారాయణ, అచ్చెన్నాయుడు, సనపాల నారాయణరావు, ఎం. జయరావు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అనంతరం మాట్లాడిన మామిడి సత్యనారాయణ, నరసన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమావేశాన్ని ఆదివారం సాయంత్రం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సనపల అన్నజీరావు ముఖ్య అతిథిగా హాజరవుతారని వెల్లడించారు. పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై సమావేశంలో చర్చించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. స్థానిక ప్రజలకు సేవా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు.

# ఘనంగా శివాజీ జన్మదిన.. శిరీష వివాహ వార్షికోత్సవం



**పలాస, మే 22 (వార్త):** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి గౌతు శివాజీ జన్మదిన వేడుకలు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, వెంకన్న చౌదరిల వివాహ వార్షికోత్సవ వేడుకలను టిడిపి నాయకులు, కార్యకర్తలు నియోజకవర్గ వ్యాప్తంగా అత్యంత శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలుచోట్ల వినూత్న సేవా కార్యక్రమాలను చేపట్టారు. రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదానం వేడుకల్లో భాగంగా కాశీబుగ్గ రామాలయంలో టిడిపి నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు, ప్రజలకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అన్నా క్యాంటీన్‌లో కేక్ కటింగ్, ఉచిత భోజనాలు అనంతరం కాశీబుగ్గ బస్టాండ్ వద్ద ఉన్న అన్నా క్యాంటీన్ వద్ద నాయకులు, కార్యకర్తలు కలిసి కేక్ కట్ చేసి, ఒకరికొకరు తినిపించుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఈ సందర్భంగా అన్నా క్యాంటీన్‌కు వచ్చిన వారందరికీ ఉచితంగా భోజన వసతి కల్పించి, అన్నదానం చేశారు. ప్రభుత్వాసుపత్రిలో పండ్లు, రొట్టెల పంపిణీ సేవా దృక్పథంతో సాగిన ఈ వేడుకల్లో భాగంగా, నాయకులు స్థానిక ప్రభుత్వాసుపత్రిని సందర్శించారు. అక్కడ చికిత్స పొందుతున్న రోగులకు, వారి సహాయకులకు రొట్టెలు, పండ్లను పంపిణీ చేసి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సేవా కార్యక్రమాల్లో టిడిపి ప్రముఖ నాయకులు పిరికర్ల విఠల్ రావు, మల్లా శ్రీనివాస్, బడ్డ నాగరాజు, లోడగల కామేశ్వరరావు, సూర్యనారాయణ, గాలి క్రిష్ణారావు, చిన్ని, క్రిష్ణమూర్తి, డి. నర్సింహులు, కె. నర్సింహులు, సత్యం, రామక్రిష్ణ, ఆత్మారావు, జగదీష్‌లతో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ అక్రమ నిల్వలపై అధికారుల ఆకస్మిక దాడులు

**పలాస, మే 22 (వార్త):** పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల లో గల ప్లాస్టిక్ గోడౌన్ లో అక్రమ నిల్వలపై మున్సిపల్ అధికారులు కఠిన చర్యలు చేపట్టారు..!మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్ ఆదేశాలు మేరకు కాశీబుగ్గ నిత్యానంద నగర్‌లోని పలు ప్లాస్టిక్ గొడౌన్లపై ఆకస్మిక దాడులు నిర్వహించిన అధికారులు. భారీగా నిషేధిత ప్లాస్టిక్ సంచులు, ప్లాస్టిక్ సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. సుమారు 300 కేజీల ప్లాస్టిక్ వస్తువులను ప్రత్యేక వాహనంలో మున్సిపల్ కార్యాలయానికి తరలించారు. అక్రమ నిల్వలపై కేసులు నమోదు చేసి కొన్ని గొడౌన్లను సీజ్ చేసిన అధికారులు. “ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీ” లక్ష్యంగా ఇలాంటి దాడులు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు. రాత్రి సమయంలో అధికారుల బృందం దాడి చేసి ప్లాస్టిక్ గోడౌన్లో సీజ్ చేయడం చర్చనీశంగా మారింది. తెర వెనుక మంత్రాలు జరుగుతున్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



## గ్రామాల్లో పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి

**- అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి: ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి**

**- జలుమూరు మండల సర్వసభ్య సమావేశంలో పిలుపు**




**జలుమూరు, మే 22 (వార్త):** ప్రతి గ్రామంలో పారిశుధ్య నిర్వహణకు అధికారులు, మండల ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించి పరిశుభ్రమైన గ్రామాల నిర్మాణానికి కృషి చేయాలని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సూచించారు. శుక్రవారం జలుమూరు మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. గ్రామ సర్పంచుల పదవీకాలం ముగిసిన నేపథ్యంలో పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన అన్నారు. గ్రామాల్లో చెత్త నిర్వహణ, కాలువల శుభ్రత, తాగునీటి వనరుల పరిశుభ్రత వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. పారిశుద్ధ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమిష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పరిశుభ్రమైన వాతావరణం ప్రజల ఆరోగ్యానికి ఎంతో అవసరమని, పారిశుధ్య కార్యక్రమాలను నిరంతర ప్రక్రియగా కొనసాగించాలని ఆయన అన్నారు. మండల అధ్యక్షుడు వాన గోపి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వివిధ శాఖల అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలు, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై చర్చించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ సమావేశంలో మండల ముఖ్య సలహాదారుడు పైడివేటి రావు, ఏఎంసీ చైర్మన్ తర్ర బలరాం, మండల అభివృద్ధి అధికారి బి. చిన్నముడు, తహసీల్దార్ జె. రామారావు, వంశధార ఏఈఈ ధనుంజయ్, వెలుగు ఏపీఎం హేమసుందరరావు, వైద్యాధికారి డాక్టర్ గొలివి సుజాత, పశువైద్యాధికారి ముద్దాడ దీప్తి జైశ్రీధర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కార్మికులకు ఉచిత లస్సీ పంపిణీ

**- సమాజ సేవ ధ్యేయంతో ముందుకొచ్చిన రిటైర్డ్ సీఐ సూరా రామసూర్యారావు**

**- అభినందించిన గ్రామ పెద్దలు**

**జలుమూరు, మే 22 (వార్త):** దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగం గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కార్మికులకు ఉచితంగా లస్సీ పంపిణీ చేసి సామాజిక సేవలో తన ప్రత్యేకతను చాటుకున్నారు సోషల్ వర్కర్, రిటైర్డ్ కమ్యూనికేషన్ సీఐ సూరా రామసూర్యారావు. వేసవి ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని సుమారు 500 మంది ఉపాధి హామీ కార్మికులకు రూ. 10 వేల విలువైన విశాఖ డైరీ మ్యాంగో లస్సీని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్మికులతో మమేకమైన సూరా రామసూర్యారావు వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. మండుటెండల్లో శ్రమిస్తున్న కార్మికులకు తాగునీరు, మజ్జిగ, లస్సీ వంటి శీతల పానీయాలు అందించడం ద్వారా ఆరోగ్య పరిరక్షణకు తోడ్పడవచ్చని ఆయన పేర్కొన్నారు. కార్మికులు మాట్లాడుతూ, వేసవి కాలంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని తెలిపారు. పదవీ విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగులు, సేవాభావం కలిగిన వ్యక్తులు కూడా ఇలాంటి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ సేవా కార్యక్రమాన్ని సామాజిక కార్యకర్త, శ్రీముఖలింగేశ్వర దేవస్థానం అర్చక సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు నాయుడుగారి రాజశేఖర్, మాజీ ఉపసర్పంచ్ గుంట కర్ణవీరుడు , ఇంజనీర్ సూరా సింహాచలం, పలువురు గ్రామ పెద్దలు అభినందించారు. సమాజ సేవ లక్ష్యంగా మరిన్ని కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు ఉపయోగపడే విధంగా సేవలను కొనసాగించాలని సూచించారు. సమాజంలో సేవా దృక్పథం పెంపొందించి అవసరమైన వారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం కార్మికులు నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.



# టీబీ బాధితులు అప్రమత్తంగా ఉండాలి

**- హై రిస్క్ వ్యక్తులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించిన జిల్లా టీబీ కంట్రోలర్**

**- వ్యాధి వ్యాప్తి నివారణకు జాగ్రత్తలు పాటించాలని సూచన**

**నరసన్నపేట, మే 22 (వార్త):** టీబీ వ్యాధితో బాధపడుతున్న వారు అప్రమత్తంగా ఉంటూ వైద్యుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా టీబీ కంట్రోలర్ అధికారి తాడేలా శ్రీకాంత్ సూచించారు. శుక్రవారం నరసన్నపేట మండలం ఉర్లాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన హై రిస్క్ టీబీ నిర్ధారణ పరీక్షల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టీబీ లక్షణాలు ఉన్నవారు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయిన వారు క్రమం తప్పకుండా మందులు వాడుతూ వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందాలని చెప్పారు. టీబీ ఒక అంటువ్యాధి కావడంతో బాధితులు సాధ్యమైనంత వరకు ఇతరులతో సన్నిహిత సంబంధాలను తగ్గించి, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని వివరించారు. వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే పూర్తిగా నయం చేసుకునే అవకాశం ఉంటుందని, అందువల్ల ప్రజలు ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదని ఆయన అన్నారు. హై రిస్క్ వర్గాలకు చెందిన వ్యక్తులకు ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించడం ద్వారా వ్యాధిని ముందుగానే గుర్తించి చికిత్స అందించడమే లక్ష్యమని తెలిపారు. టీబీ నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో కీలకమని, వ్యాధిపై అవగాహన పెంచుకోవడంతో పాటు అనుమానాస్పద లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉర్లాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఆక్రమణలతో కనుమరుగవుతున్న వంశధార కాలువ

**- పర్యవేక్షణ లోపంతో కాలువ రూపురేఖలు మాయం**

**- సాగునీటి సరఫరాపై ప్రభావం పడుతుందని రైతుల ఆందోళన**

**నరసన్నపేట, మే 22 (వార్త):** నరసన్నపేట పట్టణంలోని ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న వంశధార కాలువ ప్రస్తుతం రూపురేఖలు కోల్పోయి కనుమరుగయ్యే పరిస్థితికి చేరిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక వంశధార సబ్ డివిజన్ కార్యాలయానికి సమీపంలోనే ఉన్న ఈ కాలువ నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా రోజురోజుకూ దయనీయ స్థితికి చేరుకుంటోందని పేర్కొంటున్నారు. ఈ కాలువ ద్వారా పరిసర ప్రాంతాల పలు గ్రామాలకు సాగునీరు అందాల్సి ఉండగా, ప్రస్తుతం కాలువ ఇరువైపులా ఆక్రమణలు పెరగడంతో నీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడుతున్నాయని రైతులు చెబుతున్నారు. కాలువ గట్లు ఆక్రమణలకు గురికావడంతో పాటు పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం పేరుకుపోవడం వల్ల కాలువ అసలు స్వరూపమే కనిపించకుండా పోతోందని వాపోతున్నారు.

సంబంధిత అధికారులు తరచూ పర్యవేక్షణ చేపట్టకపోవడం, ఆక్రమణలపై చర్యలు తీసుకోకపోవడంతో పరిస్థితి మరింత దిగజారుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. సాగునీటి కాలువలు వ్యవసాయానికి జీవనాడిగా నిలుస్తాయని, వాటి పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో కాలువను వెంటనే శుభ్రపరచి ఆక్రమణలను తొలగించాలని, నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు. కాలువ పునరుద్ధరణ చేపట్టకపోతే సాగునీటి సరఫరాపై ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



# సమస్యలు లేని పంచాయతీలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

**పలాస, మే 22 (వార్త):** సమస్యలు లేని పంచాయతీలుగా తీర్చిదిద్దడమే మా లక్ష్యమని పలాస తాసిల్దార్ టి కళ్యాణ్ చక్రవర్తి అన్నారు.

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రతి నియోజకవర్గంలో ఒక గ్రామానికి 4 సార్లు సందర్శించి అక్కడ ఉన్న సమస్యలను గుర్తించి వాటినీ అందరూ అధికారులు వెళ్ళి పరిష్కరించాలని ఆదేశించడంతో రెవెన్యూ గ్రామ సభను పలాస మండలం చినంచల పంచాయతీ రాజగోపాలపురంలో రెవిన్యూ గ్రామ సభను శుక్రవారం నిర్వహించారు. గ్రామస్థులు వారి వారి సమస్యలను తెలియ చేశారు. ముఖ్యంగా నీటి కాలువలు, గ్రామస్థులకు సంబంధించిన ఉమ్మడి భూమి సబ్ డివిజన్, పంట కాలువలు ప్రక్కన ఉన్న సరిహద్దులు సరి చెయ్యడం వంటి సమస్యలను గుర్తించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ కళ్యాణ్ చక్రవర్తి, ఎంపిడివో వసంత్ కుమార్, ఏఈ పంచాయతీరాజ్ ,ఏ హౌసింగ్, డిప్యూటీ తాసిల్దారు, మండల సర్వేయర్, వీఆర్వో, సర్వేయర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. .



## జన్ భాగీదారీ జన జాగృతితో మహిళాభివృద్ధి.



**మందస, మే 22(వార్త):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న జన జాగృతి ప్రజా చైతన్యం, స్త్రీల భాగస్వామ్యం మహిళాబివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని వెలుగు, ఐటీడీఏ, గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు అన్నారు. మందస మండలంలోని కొండలోగాంలో శుక్రవారం నిర్వహించిన పీఎం జన భాగీదారీ మహిళా సంఘాలతో అవగాహన ర్యాలీ అనంతరం ఏర్పాటు చేసిన గ్రామ సభలో ప్రత్యేక అధికారిగా పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ముఖ్యముగా 'సబ్కీ దూర్ సబ్సె పెహ్లే' నినాదం ప్రకారం అందరికంటే అబివృద్ధికి దూరంగా ఉన్న వారికి ముందుగా... అన్న సంకల్పంతో గిరిజన గ్రామాలలో వైద్య శిబిలాలు, ఆరోగ్య సేవలు, గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు, కళలు, వారి హక్కులపై అవగాహన తదితర అంశాలపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. వికాసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా ప్రతీ కుటుంబానికి ఒక మహిళా ఎంటర్ప్రెనర్ అన్న విషయాన్ని గ్రామ సంఘంలో అందరు మహిళలు వార్షిక జీవనోపాదుల ఋణ ప్రణాళికలు ఖచ్చితంగా అమలు చేయడం ద్వారా సాధ్యపడుతుందన్నారు. మహిళా సంఘాల సభ్యులు కుటీర పరిశ్రమలు తో పాటు చిరు ధాన్యాలతో మంచి మంచి తినుబండారాలు తయారు చేసి ప్రజా ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడవచ్చని వివరించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు వెలుగు క్లస్టర్ కోఆర్డినేటర్ బాలక్రిష్ణ, వీఓఏలు ఆనందు, జగబంధు, సచివాలయ సిబ్బంది, హెల్త్, అంగన్వాడీ, ఆశా తదితర అన్ని శాఖలు సిబ్బంది, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## గోపాలసాగరం అభివృద్ధితో రైతులకు ఎంతో మేలు

### - రూ.36లక్షలతో సుందరీకరణ పనులు-ఎంఎల్ఏ గౌతు శిరీష



**మందస, మే 22(వార్త):** గోపాలసాగరం అభివృద్ధితో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని పలాస నియోజకవర్గం శాసనసభ్యురాలు గౌతు శిరీషా అన్నారు. మందస పట్టణంలోని గోపాలసాగరం అభివృద్ధి, సుందరీకరణకు మంజూరైన రూ.36లక్షల పనులను గురువారం శంకస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ శిరీషా మాట్లాడుతూ డబ్ల్యుడీసీ, పీఎంకేఎస్ వై 2.0 ప్రాజెక్టు(వాటర్ షెడ్)లో భాగంగా గోపాలసాగరం చెరువు సుందరీకరణ పనులకు, అభివృద్ధి పనులకు ప్రభుత్వం ద్వారా రూ.36 లక్షల నిధులను మంజూరు చేయడం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చెరువుల అభివృద్ధి ద్వారా భూగర్భ జలాల పెంపు, వ్యవసాయానికి నీటి అందుబాటు, పర్యావరణ పరిరక్షణకు ఎంతో మేలు జరుగు తుందన్నారు. గోపాలసాగరం చెరువు సుందరీకరణ పూర్తయిన అనంతరం స్థానిక ప్రజలకు మరింత ఉప యోగకరంగా మారుతుందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి, నీటి వనరుల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, పలాస నియోజకవర్గ అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని తెలిపారు. కార్యక్రమంలోమందస మండల అధ్యక్ష కార్యదర్శులు, మండల నాయకులు, గ్రామస్థాయి నాయకులు, నీటి సంఘాల నాయకులు, సంబంధిత అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ధర్మానకు ఆత్మీయ సత్కారం



**సోంపేట, మే 22(వార్త):** మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావుకు ఇచ్ఛాపురం నియోజకవర్గ వైసీపీ నేతలు కార్యకర్తలు శుక్రవారం సాయంత్రం కంచిలి మండలం జక్కర గ్రామం వద్ద కొబ్బరి తోటలో ఆత్మీయ సత్కారం నిర్వహించారు. ఎమ్మెల్సీ నర్తు రామారావు వైసీపీ సమన్వయకర్త సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి కంచిలి సోంపేట ఎంపీపీలు పైల దేవదాసు రెడ్డి డాక్టర్ నిమ్మను దాసు మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పిలక రాజ్యలక్ష్మి ఇప్పిలి కృష్ణారావు ఇచ్ఛాపురం ఎంపీపీ బోర పుష్ప, జడ్పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, నర్తు శివాజీ నర్తు చామంతి తదితరుల సమక్షంలో బర్డే కేక్ కట్ చేసి ధర్మాన జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వాస్తవానికి గురువారం ధర్మాన జన్మదినం అయినప్పటికీ ఆయన పూరి జగన్నాథుడి యాత్రలో ఉండడంతో శుక్రవారం తిరుగు ప్రయాణం సందర్భంగా ప్రసాద్ రావు ను ఇక్కడ నిలిపి జన్మదినోత్సవ కార్యక్రమాన్ని అభిమానుల మధ్య ఆత్మీయంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనేక విషయాలను పిచ్చాపాటిగా మాట్లాడుకున్నారు. ఈ కార్యక్రమాల్లో డాక్టర్ ఉలాల కోదండరాం, ఉలాల దివ్యభారతి, కడియాల ప్రకాష్, పూడి నేతాజీ, బతకల మోహనరావు, పొడుగు కామేష్, మాజీ ఏఎంసీ చైర్మన్ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులకు..అనాథలకు పండ్ల రసాల పంపిణీ

**సోంపేట, మే 22(వార్త):** మండే ఎండలతో విలవిలలాడుతున్న పరిస్థితుల్లో మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ జన్మదినం అలాగే పలాస ఎమ్మెల్యే గౌత శిరీష పెళ్లిరోజు సందర్భాన్ని పురస్కరించుకొని సోంపేట సమీపంలో గల సీతయ్య ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో నివాసం ఉంటున్న అనేకమంది వృద్ధులు అనాథలకు సోంపేట శ్రీసైన సంఘం అధ్యక్షులు రేల నారాయణరావు ఆధ్వర్యంలో శుక్రవారం పండ్ల రసాలను పంపిణీ చేశారు. మీ అందరి ఆశీస్సులతో శివాజీ మరియు శిరీషమ్మలకు భగవంతుడు మంచి ఆయురారోగ్యాలు ఇచ్చి వారికి మరింత ప్రజాసేవ చేసే భాగ్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు కాశీపతి బేన హేమారావు ఆనంగి బాబురావు సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# మతిభ్రమించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

### - ఫ్రస్టేషన్లో నోటికి వచ్చిన మాట్లాడితే సహించేది లేదు

### - పలాసకు మీరు చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పండి

### - పలాసలో అక్రమ మద్యం, గ్రావెల్ దోపిడీలపై మీరు స్పందించడం లేదు?

### -ఎమ్మెల్యేపై వైఎస్సార్సీపీ నాయకుల తీవ్ర స్థాయిలో ధ్వజం



**పలాస, మే 22 (వార్త):** పలాస ఎమ్మెల్యే మతి భ్రమించి మాట్లాడుతున్నారని, ఎమ్మెల్యే గౌతు శిరీష ఫ్రస్టేషన్లో నోటికి వచ్చిన మాట్లాడితే సహించేది లేదని, పలాసకు మీరు చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని, పలాసలో అక్రమ మద్యం, గ్రావెల్ దోపిడీలపై మీరు స్పందించడం లేదంటూ పలాస ఎమ్మెల్యేపై వైఎస్సార్సీపీ నాయకుల తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, వైఎస్ జగన్ మోహన్ రెడ్డిలపై పలాస ఎమ్మెల్యే ఎమ్మెల్యే చేసిన విమర్శలను తిప్పికొడుతూ పలాసలో వైఎస్సార్సీపీ నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే తీవ్ర మానసిక ఒత్తిడి, ఫ్రస్టేషన్లో మాట్లాడుతున్నారని వారు ఎద్దేవా చేశారు. నెలకు కోట్లలో మద్యం సిండికేట్ దోపిడీ చేయడం వాస్తవం కాదా అంటూ?, పలాస నియోజకవర్గంలో మద్యం ఆక్రమ వసూళ్లు జోరుగా సాగుతున్నాయని, నాయకులు లెక్కలతో సహా నిరూపించారు.

### అదనపు వసూళ్లు..

నియోజకవర్గంలోని ప్రతి మద్యం దుకాణం లోనూ క్వార్టర్ బాటిల్పై ఎమ్మార్పీ కంటే రూ. 10 నుంచి రూ.20 అదనంగా వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. పలాస నియోజకవర్గంలో సుమారు 24 మద్యం దుకాణాలు ఉన్నాయని, రోజుకు సుమారు 550 కేసుల క్వార్టర్ బాటిళ్లు (సుమారు 26,400 బాటిళ్లు), 350 కేసుల బీర్లు (సుమారు 4,200 బాటిళ్లు) అమ్ముడవుతున్నాయని,అంటే రోజుకు దాదాపు 30,000 పైగా బాటిళ్లు విక్రయించబడుతున్నాయని వివరించారు. బాటిల్కు రూ. 10 చొప్పున లెక్కగట్టినా నెలకు కొన్ని కోట్ల రూపాయలు, ఏడాదికి రూ.12 కోట్లు. ఐదేళ్లలో ఏకంగా రూ.60 కోట్ల మేర అక్రమ వసూళ్ల దోపిడీ సాగుతోందని ఆరోపించారు. ఊరూరా, వార్డు వార్డునా బెల్ట్ షాపులు తెరిచారని, ఉదయం 6 నుండి రాత్రి 12 గంటల వరకు, అర్ధరాత్రి అయినా మద్యం దొరుకుతోందని, పలాసలో మంచి నీరు దొరకడం లేదు కానీ మద్యం మాత్రం ఏ టైంలోనైనా దొరుకుతోందని విమర్శించారు. ఈ అక్రమ వసూళ్లలో స్థానిక ఎమ్మెల్యేకు వాటాలు ఉన్నాయని, అందుకే దీనిని అరికట్టడం లేదని ఆరోపించారు.

### పీఏసీఎస్ అవినీతి ఆరోపణలపై కౌంటర్

పీఏసీఎస్లో రూ. 5.5 కోట్ల అవినీతి జరిగిందంటూ ఎమ్మెల్యే చేసిన ఆరోపణలను నాయకులు ఖండించారు. గత 20 ఏళ్ల కాలంలో మీ కుటుంబ సభ్యులే (తండ్రి, తాత) ఎమ్మెల్యేలుగా ఉన్నారని, మరి అప్పుడు ఎందుకు విచారణ జరిపించలేదని ప్రశ్నించారు. ఎమ్మెల్యే స్థానంలో ఉండి కేవలం ప్రతిపక్షాలపై ఫిర్యాదులు చేయడం కాకుండా, దమ్ముంటే అధికారికంగా విచారణ జరిపించి, నివేదికలతో మాట్లాడాలని సవాల్ విసిరారు. 60 ఏళ్ల పాలనలో వలసలు పెరిగినప్పటికీ గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలోనే అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపించామని, గత 60 ఏళ్లుగా ఎమ్మెల్యే కుటుంబం ఈ ప్రాంతాన్ని పాలించినా పలాస నుండి వలసలను ఆపలేకపోయారని, యువతకు ఉపాధి కల్పించే ఒక్క పరిశ్రమ కూడా తీసుకురాలేకపోయారని దుయ్యబట్టారు. చెన్నై, దుబాయ్, హైదరాబాద్లలో ప్రమాదాలు జరిగితే అక్కడ చనిపోయే కార్మికుల్లో పలాస వాసులే ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

### కిడ్నీ హాస్పిటల్, ఉద్దానం తాగునీరు వైఎస్సార్సీపీ ఘనతే!

వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, సీదిరి అప్పలరాజుల కృషితోనే పలాసలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వచ్చాయని, కిడ్నీ రోగులకు రూ.10,000 పెన్షన్ ఇచ్చామని స్పష్టం చేశారు. హీరమండలం నుండి ఇచ్ఛాపురం వరకు ఉద్దానం తాగునీటి ప్రాజెక్ట్ ద్వారా ఇంటింటికీ మంచి నీటి పైపు లైన్ వేసి నీరిచ్చిన ఘనత తమ ప్రభుత్వానిదేనని, ఇప్పుడు ఆ పనుల వద్ద కూటమి నాయకులు ఫొటోల పొజిషన్లు ఇస్తున్నారని విమర్శించారు.

### అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపించారు..

మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ఐదేళ్ల కాలంలో పలాసను ఎంతో అభివృద్ధి చేసి పలాస-కాశిబుగ్గ కేటీ రోడ్డును సుందరంగా డబుల్ రోడ్డుగా మార్చారని, మందసను చారిత్రాత్మక ప్రాంతంగా తీర్చిదిద్ది, బస్ స్టాండ్ నిర్మించి రహదారులను విస్తరించారని వివరించారు. కాశీబుగ్గ నుంచి వజ్రపుకొత్తూరు వరకు, నువ్వలరేవు నుంచి టెక్కలిపట్నం వరకు డబుల్ రోడ్లు వేశారని, ఇప్పుడు ఈ అభివృద్ధి పనుల వద్ద కూటమి నాయకులు ఫొటోలు దిగుతూ, కేవలం బల్బులు వేసి తామే అభివృద్ధి చేశామని "క్రెడిట్ చోరీ" (దీదీ చోరీ - జీజా చోరీ)కి పాల్పడుతున్నారని ఎద్దేవా చేశారు.

### కొండలను పిండి చేస్తున్న గ్రావెల్ మాఫియా

నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రావెల్, మట్టి దోపిడీ విపరీతంగా పెరిగిపోయిందని ఆరోపించారు. నెమలికొండ, సూదికొండ, బోడికొండ, ఉజ్జిడిమెట్ట, రాజగోపాలపురం కొండలను పిండి చేస్తూ, అల్లిమార్క, బెండికొండ, మందస కొండల్లో గ్రావెల్, ఇసుక, కంకరను దోచుకుంటున్నారని మండిపడ్డారు. కూటమి నాయకులు "దాచుకో, పంచుకో, దోచుకో" అనే చందంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే కేవలం ప్రతిపక్షాలపై విమర్శలు చేయడం మానేసి, ప్రజలకు ఏం చేయాలో ఆలోచించాలని హితవు పలికారు. తాము చెప్పినవన్నీ వాస్తవాలని, ఈ అక్రమాలపై, అభివృద్ధిపై ఎప్పుడైనా, ఎక్కడైనా తాము జీవోలు, రికార్డులతో సహా బహిరంగ చర్చకు సిద్ధమని వైఎస్సార్సీపీ నాయకులు సవాల్ విసిరారు. త్వరలోనే సీదిరి అప్పలరాజు కూడా అన్ని లెక్కలతో ప్రెస్ మీట్ పెడతారని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పట్టణ వైసీపీ అధ్యక్షుడు శిష్టు గోపి, జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బోర కృష్ణారావు, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నర్తు రమణ, మున్సిపాలిటీ వైసీపీ స్పోక్ పర్సన్ గుజ్జు జోగారావు తదితరులు పాల్గొన్నారు.


## జగ్గుశాస్త్రుల పేటలో విద్యుత్ కేంద్రానికి శంకుస్థాపన



**ఆమదాలవలస, మే 22(వార్త):** ఆముదాలవలస నియోజకవర్గంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. పెరుగుతున్న జనాభా, పారిశ్రామిక అవసరాలు, గృహ వినియోగాన్ని దృష్టిలో ఉంచుకుని ఆధునిక సదుపాయాలతో ఈజగ్గు శాస్త్రుల పేటలో 33 / 11 కేవీ విద్యుత్ కేంద్రానికి శుక్రవారం కేంద్రమంత్రి రామ్మోహన్నాయుడు, ఎమ్మెల్యే కూన రవికుమార్ శంకుస్థాపన చేశారు. ఈ ఉపకేంద్రం నిర్మాణం పూర్తయిన తర్వాత పరిసర ప్రాంతాల్లో తరచూ ఎదురయ్యే లో వోల్టేజ్ సమస్యలు, విద్యుత్ అంతరాయాలు తగ్గి ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుబాటులోకి వస్తుందని శాసనసభ్యులు కూన రవి కుమార్ అన్నారు. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నాయని తెలిపారు. విద్యుత్ రంగ అభివృద్ధి ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు పరిశ్రమల అభివృద్ధికి కూడా దోహదపడుతుందన్నారు. ఆముదాలవలస ప్రాంత అభివృద్ధికి అవసరమైన ప్రతి అంశంలో పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ నూతన 33/11 కేవీ విద్యుత్ కేంద్రం ద్వారా ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీలు, సమీప గ్రామాలకు స్థిరమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందనుంది. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు విద్యుత్ శాఖ అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## బాలిగాం మాజీ ఎంపీటీసీ వెంకయ్య మృతి

### -నివాళులర్పించిన నాయకులు, పెద్దలు



**మందస, మే 21(వార్త):** కులపెద్దగా, రాజకీయ నాయకునిగా, సంఘ సేవకునిగా ఎన్నో సేవలందించిన బొంగి వెంకయ్య శుక్రవారం ఆకస్మికంగా మరణించారు. మందస మండలంలోని బాలిగాం గ్రామానికి చెందిన బొంగి వెంకయ్య ఎంపీటీసీగా కూడా పని చేశారు. రాజకీయాల్లో ఆయన శైలి ప్రత్యేకమైనది. ముక్కుసూటిగా మాట్లాడే వెంకయ్య ప్రజా సమస్యలపై చివరి శ్వాస వరకు పోరాడారు. రాజకీయాలు శాశ్వతం కాదని, నాయకులు చేసే అభివృద్దే ప్రధానమని నమ్మిన నాయకుడు బొంగి వెంకయ్య. మంచి మనిషిగా గుర్తింపు పొందిన ఆయన కాళింగ సామాజిక వర్గం సంక్షేమానికి ఎంతో కృషి చేశారు. జిల్లాలోనే బొంగి వెంకయ్య పేరంటే తెలియని వారుండరన్న నానుడి అందరిలో ఉంది. సౌమ్యునిగా గుర్తింపు పొందిన వెంకయ్య బాలిగాంలో మంచి నాయకునిగా పేరుంది. ఉమ్మడి కుటుంబానికి చెందిన ఆయన కుటుంబం కూడా పెద్దదే. బాలిగాం గ్రామానికి పెద్దగా విశేషమైన సేవలను అందించారు. బొంగి వెంకయ్య ఆకస్మిక మరణం పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన అంత్యక్రియల్లో పాల్గొని నివాళులు అర్పించారు. బొంగి వెంకయ్య కుటుంబానికి ప్రగాడ సంతాపం తెలిపారు. కుమారులు వైకుంఠరావు. పాపారావు, ఆదినారాయణ, కుమార్తెలు రెయ్యమ్మ, వజ్రం, సోదరుడు సీతారాం, కుమారులు ప్రవీణ్, మల్లేశ్వరరావులతో సుమారు 45మంది వరకు కుటుంబ సభ్యులు ఉన్నారు. కుటుంబసభ్యులు, బంధుమిత్రుల అశ్రనయనాల మధ్య బొంగి వెంకయ్య అంత్యక్రియలను నిర్వహించారు.

# పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలి

### - ధరల పెంపుతో సామాన్యులపై భారం

### -సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన




**నరసన్నపేట, మే 22 (వార్త):** పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో సామాన్య ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని, కేంద్ర ప్రభుత్వం వెంటనే ఇంధన ధరలను తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొన్న శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం నరసన్నపేట మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల అనంతరం కేంద్ర ప్రభుత్వం అనేక దఫాలుగా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతూ ప్రజలపై అదనపు భారం మోపుతోందని విమర్శించారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోకుండా భారాలు పెంచే విధానాలను అమలు చేస్తోందని ఆరోపించారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ఇంధన ధరల పెంపుతో రవాణా వ్యయాలు పెరిగి అన్ని వస్తువుల ధరలపై ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. దీంతో ప్రజల జీవన వ్యయం మరింత పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టినప్పటికీ దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడం అన్యాయమని కొన్న శ్రీనివాస్ అన్నారు. ఇప్పటికే వంటగ్యాస్ ధరల పెరుగుదలతో ప్రజలు ఇబ్బందులు పడుతుండగా, ఇంధన ధరలను వరుసగా పెంచడం ప్రజల నెత్తిన మరింత భారం మోపడమేనని విమర్శించారు. ప్రజల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం వెంటనే పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని, ధరల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఐ నరసన్నపేట మండల కార్యదర్శి ఆర్. అరవింద్, పార్టీ నాయకులు సీహెచ్. లవకుమార్, భాస్కరరావు, లక్ష్మి, రాజు, ఎర్రయ్య, బైరాగి, మురళి, అచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.




## పారిశుధ్య కార్మికుల జీతం రూ.18 వేలకు పెంపు

### - ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి చొరవతో సమస్యకు పరిష్కారం

### -ప్రభుత్వ నిర్ణయంపై కార్మికుల హర్షం

**నరసన్నపేట, మే 22 (వార్త):** నరసన్నపేట నియోజకవర్గంలోని పారిశుధ్య కార్మికులకు జీతాల పెంపు రూపంలో ఊరట లభించింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం పారిశుధ్య కార్మికుల వేతనాలను రూ.13 వేల నుంచి రూ.16 వేలకు పెంచగా, తాజాగా నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి చొరవతో వాటిని రూ.18 వేలకు పెంచేందుకు చర్యలు చేపట్టడంతో కార్మికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్య కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, వేతనాల పెంపు తమ జీవనోపాధికి ఎంతో తోడ్పాటునిస్తుందని పలువురు కార్మికులు పేర్కొన్నారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో రూ.16 వేల వేతనం కూడా సరిపోవడం లేదని భావించిన కార్మికులు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని కలిసి తమ సమస్యలను వివరించి వినతిపత్రం అందజేశారు. కార్మికుల సమస్యలను శ్రద్ధగా విన్న ఎమ్మెల్యే వెంటనే స్పందించి జిల్లా కలెక్టర్తో పాటు సంబంధిత పంచాయతీ అధికారులతో చర్చలు జరిపారు. ఆయన ప్రత్యేక చొరవతో పారిశుధ్య కార్మికుల జీతాలను మరో రూ.2 వేలు పెంచి రూ.18 వేలకు చేర్చేలా చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి కృతజ్ఞతలు తెలిపారు. తమ సమస్యలను అర్థం చేసుకుని తక్షణమే స్పందించి పరిష్కార మార్గం చూపారని కొనియాడారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, పారిశుధ్య కార్మికులు. స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546